క్లుప్తంగా

నేడు రంగనాయక, గోదాదేవి కల్యాణం



ఖిలా వరంగల్: భోగి, సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని ఆదివారం ఉదయం కరీమాబాద్ ప్రాంతంలోని రంగనాయకుల గట్టు (ఉర్సుగుట్ట)పై ఉన్న గోదా సహిత రంగనాయకస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు వరగయోగుల భాస్కర్‌స్వామి, అర్చకుడు వరయోగుల లక్ష్మీప్రసాద్ శనివారం తెలిపారు. ఉదయం 11గంటలకు శాస్త్రోక్తంగా నిర్వహించే కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించాలని వారు కోరారు.

22న ప్రత్యేక ఉత్సవం



కాజీపేట: అయోధ్యలో ఈనెల 22న శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం జరగనున్న నేపథ్యంలో వెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్ ఆవరణలో జరగనున్న ఉత్సవాలను విజయవంతం చేయాలని బీజేపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం సూచించారు. 63వ డివిజన్ బాపూజీనగర్ కూరగాయల మార్కెట్ ఆవరణలో చిరు వ్యాపారులతో కలిసి శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుమారు 2వేల మందికి ప్రధాన రహదారిపై సహపంక్తి భోజనాలు వడ్డించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నిషాని భిక్షపతి, కొట్టె విలేకరి, ఏసు, విజయ, చిన్న సాంబయ్య, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐఏ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్‌గా మధు



వరంగల్: జాతీయ సమాచార హక్కు పరిరక్షణ సమితి (ఆర్ఐఏ) ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్‌గా సీనియర్ జర్నలిస్ట్ గాడిపెల్లి మధును జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మర బోయిన కేశవులు ఆదేశానుసారం నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కన్నెబోయిన ఉషారాణి తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని వెలికి తీస్తూ, సమాచార హక్కు చట్టం ప్రాముఖ్యతను పౌరులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తానని మధు తెలిపారు. తన నియామకానికి సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జీఎంహెచ్‌లో దుప్పట్ల పంపిణీ



హన్మకొండ చౌరస్తా: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కూతురు గోదారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని సామల జయప్రకాష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలకు శనివారం దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నాయిని కూతురు, అల్లుడు గోదారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి హాజరై చద్దర్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా బాధ్యులు ముస్తాక్ నేహాల్, దీపక్‌రెడ్డి, నాయకులు సరళ, సంపత్, చంద్రశేఖర్, మేరీ, స్రవంతి, సుజాత, సుకన్య, అనిక్ష, ఇందిర, కవిత, స్వరూప, మానస, సారంగం, రమేష్ పాల్గొన్నారు.

బెల్ట్ షాపులను అరికట్టాలి

వరంగల్: ప్రజల జీవితాలను సర్వనాశనం చేస్తున్న బెల్టు షాపులను పూర్తిగా నిర్మూలించి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు చర్యలు చేపట్టాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు తెలిపారు. పల్లెలు, పట్టణాల్లో నిబంధనలకు విరుద్ధంగా విచ్చలవిడిగా బెల్టు షాపులను నిర్వహిస్తూ మద్యాన్ని ఏరులుగా పారిస్తూ రైతు కూలీలు, అసంఘటిత రంగ కార్మికులు, యువకులను మద్యానికి బానిసలుగా చేసి రాష్ట్రాన్ని తాగుబోతుల తెలంగాణగా గత ప్రభుత్వం మార్చిందని పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే బెల్ట్ షాపులను పూర్తిగా నియంత్రిస్తామని ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం.. వెంటనే హామీని అమలు చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కోరారు.

నిరుద్యోగంపై గళమెత్తాలి

న్యూశాయంపేట: నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై శాసన మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి కోరారు. ఈమేరకు హనుమకొండకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి శనివారం వచ్చిన సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ హామీల అమలుకు ఒత్తిడి చేయాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు.

భారీ వాహనాలతో రోడ్డు ధ్వంసం

- గుంతలమయమైన మడికొండ – ధర్మసాగర్ రహదారి
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు, ప్రయాణికులు





అధ్వానంగా ఉన్న మడికొండ - ధర్మసాగర్ రహదారి

మడికొండ: మడికొండ – ధర్మసాగర్ రోడ్డు గుంతలతో అధ్వానంగా తయారైంది. ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారిపై నిత్యం భారీ వాహనాలు, లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. దాంతో రోడ్డు మొత్తం ధ్వంసమైంది. రోడ్డు ప్రమాదం జరిగి ప్రాణనష్టం జరిగినప్పుడు మాత్రమే భారీ వాహనాలు ఆ మార్గంలో తిరగకుండా పోలీసులు కట్టడి చేసి ఆ తర్వాత మిన్నకుండిపోతున్నారు. రాత్రి సమయంలో వాహనదారులు భయంభయంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులు దృష్టి సారించి భారీ వాహనాలు ఔటర్ రింగ్ రోడ్డు నుంచి గ్రామంలోకి రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భారీ వాహనాలు రాకుండా చూడాలి



మడికొండ గ్రామంలోకి భారీ వాహనాలు రావడంతో రోడ్డు మొత్తం ధ్వంసం అయింది. అలాగే, రోడ్డు ప్రమాదాలు జరిగి విలువైన ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ప్రమాదం జరిగినప్పుడే భారీ వాహనాలను కట్టడి చేసి ఆ తర్వాత పోలీసులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

– కొత్తకొండ వెంకన్న గౌడ్, స్థానికుడు

వైభవంగా ధనుర్మాసోత్సవాలు



కాజీపేట: గోదాదేవి వేషధారణలో భక్తులు

మడికొండ: మడికొండలోని వేణుగోపాల స్వామి దేవాలయంలో ధనుర్మాసోత్సవాలను శనివారం వైభవంగా నిర్వహించారు. అర్చకుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, సాయంత్రం 7గంటలకు స్వామివారికి సామూహిక విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, గోవింద నామాలు, శ్రీకృష్ణ అష్టకం, మంత్రపుష్పం, మంగళశాసనాలు, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సతీష్, కడార్ల నరేందర్, బజ్జూరి శ్రీనివాస్, రాపర్తి ఉపేంద్రచారి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గోదాదేవి వేషధారణలో భక్తులు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో శనివారం ధనుర్మాసోత్సవాన్ని నిర్వహించారు. వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఇన్‌చార్జ్ హరిపురం సునంద ఆధ్వర్యంలో తిరుప్పావై సేవ గోవింద నామస్మరణ జరిపించారు. చిన్నారులు సుప్రజ, చందన, స్వస్తిక్ మనాలి.. గోదాదేవి, పద్మావతి వేషధారణలో వేంకటేశ్వరుడికి పూజలు నిర్వహించారు.

సీతారామాలయంలో తిరుప్పావై ఉత్సవం

కాజీపేట: ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకుని హనుమకొండ రెవెన్యూ కాలనీలోని సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శనివారం 28వ విశేష పాశురం తిరుప్పావై గోష్ఠి నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులతో పాటు పాలక మండలి సభ్యుడు, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నీలిమ, ఆయన తల్లి జయమాలను సన్మానించారు.

కాజీపేట ఎస్సైగా శివకుమార్ బాధ్యతల స్వీకరణ

కాజీపేట: కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శివకుమార్ శనివారం సాయంత్రం విధుల్లో చేరారు. నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా ఆదేశం మేరకు బదిలీపై కాజీపేట పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. అనంతరం, సీఐ సార్ల రాజుతో పాటు ఏసీపీ డేవిడ్ రాజ్‌తో పాటు జిల్లా అధికారులను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

రైలులో నుంచి జారిపడి యువకుడి మృతి

కాశిబుగ్గ: కదిలే రైలులో నుంచి జారిపడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన చింతలపల్లి – వరంగల్ రైల్వే స్టేషన్ల మధ్య శనివారం జరిగింది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రా బహర్‌వాటికి చెందిన సౌరవ్‌సింగ్ (23) ఖమ్మంలో టైల్స్ షాప్‌లో పని చేస్తున్నాడు. తన ఊరు వాళ్లతో కలిసి ఇంటికి వెళ్లేందుకు ఖమ్మంలో శనివారం తమిళనాడు ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. వంచనగిరి రైల్వే గేటు సమీపంలో సౌరవ్‌సింగ్ ప్రమాదవశాత్తు నడుస్తున్న రైలులో నుంచి జారి కిందపడ్డాడు. దాంతో తలపగిలి తీవ్రగాయాలై అప్‌లైన్‌లో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో భద్రపరచినట్లు సీఐ వివరించారు.

పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు కృషి



కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి, భద్రునాయక్

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెప్మా, మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు పెండ్లి ఉపేందర్ రెడ్డి తెలిపారు. ఈమేరకు ఆసక్తి గల మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని హనుమకొండలోని కలెక్టర్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. మెప్మా పీడీ భద్రు నాయక్, సీఈఓ సిబ్బంది హాజరయ్యారు. వరంగల్ మున్సిపల్ పరిధిలో సుమారు 70 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అనుమతి కోరుతూ పాఠశాలల వివరాలు పంపాలని సంబంధిత అధికారులను ఉపేందర్‌రెడ్డి కోరారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో వారానికి మూడు రోజులపాటు ఈనెల 17, 18, 29 తేదీల్లో డ్రాయింగ్, క్రాఫ్ట్, యోగా, మోటివేషన్ లాంటి అంశాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సదుపాయాన్ని వరంగల్, హనుమకొండ, కాజీపేటలోని ప్రభుత్వ పాఠశాలలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కానిస్టేబుల్ మృతి



గోపాల్‌రెడ్డి (ఫైల్)

మామునూరు: వరంగల్ సీఏఆర్ పోలీస్ హెడ్ క్వార్టర్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ లెక్కల గోపాల్‌రెడ్డి (55).. అనారోగ్య సమస్యలతో శనివారం మృతి చెందారు. ఖిలా వరంగల్ మండలం నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలోని వినాయక నగర్ కాలనీలో ఆయన స్వగృహంలోని గోపాల్‌రెడ్డి మృతదేహాన్ని పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దశరథం, జనరల్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సెక్రటరీ గోవర్ధన్, సభ్యులు సందర్శించి నివాళులర్పించారు.

విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ కీలకం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

హన్మకొండ: విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ విద్య చాలా కీలకమని నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ దినకర్ అన్నారు. హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో మోషన్ ఐఐటీ, నీట్ జూనియర్ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డే కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఇంటర్‌తోనే పోటీ పరీక్షలు ప్రారంభమవుతాయని చెప్పారు. విద్యార్థులు విషయ పరిజ్ఞానంతో పాటు మెళకువలు నేర్చుకున్నప్పుడే పోటీ పరీక్షల్లో నెగ్గుతారని వివరించారు. మోషన్ జూనియర్ కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ ఐఐటీ, మెడికల్ సీట్లు సాధించడమే లక్ష్యంగా మోషన్ విద్యాసంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాంతో హైదరాబాద్, విజయవాడ లాంటి ప్రాంతాలకు విద్యార్థులు వెళ్లాల్సిన అవసరం లేదని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మోషన్ విద్యాసంస్థ డైరెక్టర్ డైరెక్టర్ చిర్ర గణేష్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణుడు వేణుకల్యాణ్, అధ్యాపకులు, సిబ్బంది మురళి, తాళ్లపల్లి రమేష్ గౌడ్, దండు రాజు, విజయ్ శశిధర్, పాక నాగరాజు పాల్గొన్నారు.

ఎన్ఎంఏ బాధ్యులకు అభినందన

కాశిబుగ్గ: ఉమ్మడి వరంగల్ ఎన్ఎంఏ అధ్యక్షుడు, కార్యదర్శులుగా ఎన్నికైన డాక్టర్ గుండా రవీందర్, డాక్టర్ మైదం రాజును కాంగ్రెస్ నాయకులు సిలువేరు శ్రీనివాస్ శనివారం కలిశారు. ఈ సందర్భంగా వారికి శనివారం బొకే అందజేసి అభినందించారు. రవి, అయూబ్, తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



విద్యారణ్యపురి: తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర – 2024 క్యాలెండర్‌ను వరంగల్ జిల్లా డీఐఈఓ మాధవరావు శనివారం ఆవిష్కరించారు. హనుమకొండలోని జూనియర్ కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సంగెం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, టీజీజేఎల్ఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, స్టేట్ కౌన్సిల్ సభ్యులు బుచ్చిరెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎల్లస్వామి, బాధ్యులు శ్రీనివాస్‌శర్మ, జాటోతు రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

ఏఐటీయూసీ డైరీ..

ఖిలా వరంగల్: ఏఐటీయూసీ –2024 డైరీని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో ఆవిష్కరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రవి, సహాయ కార్యదర్శి షేక్ బాష్‌మియా, గన్నారపు రమేష్, కందిక చెన్నకేశవులు, మనీశ్వర్, దండు లక్ష్మణ్, గుండె బద్రి, ఏలేందర్, యాకూబ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిష్యం పేరుతో హైటెక్ మోసం



జ్యోతిష్యుడి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను చూపుతున్న పోలీసులు

ఖిలావరంగల్: జ్యోతిష్యం పేరుతో హైటెక్ మోసాలు జరుగుతున్నాయి. 'మీ ఇట్లో ఎవరికైనా ఆరోగ్యం బాగాలేదా..? ఎంత ప్రయత్నం చేసినా ఉద్యోగం రావటం లేదా..? వివాహం కావడం లేదా..? ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారా..? అయితే జ్యోతిష్యాలయాన్ని సంప్రదిస్తే మీరు అడిగిన ప్రశ్నలకు పరిష్కారం చూపుతాను' అని సోషల్‌మీడియా, ఇతర లోకల్ ఛానల్స్‌లో ప్రకటనలు ఇచ్చేస్తున్నారు. అలాంటి ఘటన ఇటీవల హైదరాబాద్‌లోని ఛత్రినాక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈన తల్లి ఆరునెలలుగా అనారోగ్యంతో బాధపడుతుండగా, నకిలీ జ్యోతిష్యుడి ప్రకటన చూసి శ్రీకాంత్‌రెడ్డి.. వరంగల్ కరీమాబాద్‌లోని కోయవీధికి చెందిన సిరిగిరి మంజునాథ అలియాస్ బ్రహ్మం, మంజు పేర్లతో పిలువబడే వ్యక్తిని నమ్మేసి సుమారు రూ.17 లక్షలు నగదు చేతిలో పెట్టాడు. రోగం నయం కాకముందే మరింత సొమ్ము కావాలని తాంత్రికుడు డిమాండ్ చేయడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు హైదరాబాద్ ఛత్రినాక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నకిలీ జ్యోతిష్యుడిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది.

విచారణకు ఆదేశం

- 'భూ వివాదంలో తగ్గేదేలేదు' కథనానికి కదలిక
- స్పందించిన సీపీ అంబర్ కిశోర్ ఝా
- రంగంలోకి దిగిన ఇంటెలిజెన్స్

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, వరంగల్: భూవివాదంలో తగ్గేదేలేదు అంటూ వర్ధన్నపేట డివిజన్‌లోని ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్(సీఐ) అత్యుత్సాహం ప్రదర్శించారని సాక్షి దినపత్రిలో ప్రచురితమైన కథనానికి వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా స్పందించారు. శనివారం విచారణకు ఆదేశించారు. ఈ మేరకు రంగంలోకి దిగిన ఇంటెలిజెన్స్ అధికారులు బాధితుల నుంచి సమగ్ర సమాచారం సేకరించి నివేదికను తయారు చేస్తున్నారు. ఇప్పటికే హైకోర్టులో ఉన్న ఈ భూవివాదం వివరాలు తెలుసుకోవడంతోపాటు స్థానికంగా భూమిపై కబ్జాలో ఎవరున్నానే వివరాలు సేకరించారు. ఇద్దరు కానిస్టేబుల్స్ భూమి వద్దకు వెళ్లి విచారించినట్టు తెలిసింది. గతంలో బాధితుడు.. సంబంధం లేని వ్యక్తులు భూమిపైకి వచ్చారంటూ గతంలో ఫిర్యాదు చేయగా.. హైకోర్టులో కేసు ఉండడంతో అక్కడే చూసుకోవాలని, కేసు నమోదు చేయలేమని పోలీసులు తిరస్కరించారు. 2023 డిసెంబర్ 31న రాయపర్తి పోలీసు స్టేషన్‌లో దేవేందర్ ఫిర్యాదు చేసిన కాపీతోపాటు ఇది సివిల్ వివాదం కావున.. పిటిషన్ తిరస్కరిస్తున్నామని జనవరి నాలుగున సెల్ ఫోన్‌కు వచ్చిన మెసేజ్‌ను కూడా ఇంటెలిజెన్స్ పోలీసులకు అందించినట్టు సమాచారం. ఇప్పటికే విధుల్లో అలసత్వంలో ఉన్న పోలీసులపై కఠిన చర్యలు తీసుకుంటున్న సీపీ అంబర్ కిశోర్ ఝా ఇంటెలిజెన్స్ నివేదిక రాగానే సదరు సీఐపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్న చర్చ పోలీసు వర్గాల్లో జరుగుతోంది.

నియోజకవర్గంలో శాశ్వత పనులు



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నాగరాజు

హసన్‌పర్తి: వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో శాశ్వత పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. రెండవ డివిజన్‌లోని గుండ్లసింగారంలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మురుగునీటి కాల్వలు, అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, చెరువు శిఖం కబ్జాకు గురికావడంతో కాలనీ మొత్తం ముంపునకు గురవుతోందని ఎమ్మెల్యేకు స్థానికులు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ నిధులతో శాశ్వత పనులు చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రవినాయక్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రాం నర్సింహారెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు పొన్నాల రఘు, మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన, అజయ్ తదితరులు పాల్గొన్నారు. క్రీడలతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. హసన్‌పర్తి మండలం మడిపల్లి గ్రామంలో చిర్ర చేరాలు – జయలక్ష్మి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు.

రామమందిరం పేరుతో బీజేపీ రాజకీయం



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట: అయోధ్యలో రామ మందిరం పేరుతో రాజకీయం చేస్తూ ప్రజా సమస్యలను ప్రధాని మోదీ గాలికి వదిలేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు విమర్శించారు. హనుమకొండ బాలసముద్రంలోని కార్యాలయంలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మనోభావాలను బీజేపీ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగం పెరిగి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కొరవడి, ఆర్థిక వ్యవస్థ పతనమవుతున్న తరుణంలో వాటినుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు కేంద్రం రామజపం చేస్తోందని ఎద్దేవాచేశారు. మోదీ నాటకాలను ప్రజలు గమనించి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కోరారు. పార్టీ సహాయ కార్యదర్శి ఎల్లేశ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు కర్రె భిక్షపతి, తోట భిక్షపతి, ఆదిరి శ్రీనివాస్, సదాలక్ష్మి, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, రవి, దీన రాజమణి సదానందం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఖండించండి



నిరసన తెలుపుతున్న ఎస్ఐఓ నాయకులు

వరంగల్: పాలస్తీనా దేశంపై ఇజ్రాయిల్ జరుపుతున్న క్రూర, అమానవీయ దాడులకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు కార్యక్రమాలు చేపట్టాలని వివిధ శాంతియుత సంస్థలు, ప్రజాహిత శక్తులు పిలుపునిచ్చాయని స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ (ఎస్ఐఓ) వరంగల్ సిటీ అధ్యక్షుడు ఫహీముద్దీన్ సూచించారు. ఈమేరకు పోచమ్మమైదాన్ జంక్షన్‌లో ప్లకార్డులతో శనివారం సాయంత్రం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలదాచుకోవడానికి శరణం ఇచ్చిన పాలస్తీయన్ల పైనే ఇజ్రాయిల్ దాడులు చేయడం శోచనీయమని విమర్శించారు. అనేక మంది పాలస్తీయన్లు, వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలు ఇజ్రాయిల్ దాడుల్లో రోజూ మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంత కర్కశంగా ఇజ్రాయిల్ ప్రవర్తిస్తున్నా దేశాలు నోరు మెదపకపోవడం మానవత్వానికే మచ్చ అని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అబ్దుల్లా, మొయీజ్, అఫ్రోజ్ పాల్గొన్నారు.

సాంకేతిక సదస్సులతో నైపుణ్యాల పెంపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐ, అధ్యాపకులు

హసన్‌పర్తి: సాంకేతిక సదస్సులతో నైపుణ్యాలు పెంపొందుతాయని కాకతీయ యూనివర్సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య అన్నారు. కిట్స్ కళాశాలలో ఫిబ్రవరి 2, 3వ తేదీల్లో నిర్వహించనున్న జాతీయ విద్యార్థి సాంకేతిక సింపోజియం సమశోధిని –23' పోస్టర్లను కళాశాల ప్రాంగణంలో శనివారం ఆవిష్కరించారు. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, కిట్స్ స్టూడెంట్ చాప్టర్, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య మాట్లాడుతూ సాంకేతిక వేదికల వల్ల కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు అలవడుతాయని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ కార్యక్రమాన్ని పురస్కరించుకుని అన్ని ఇంజనీరింగ్ విభాగాల్లో వర్క్‌షాపులు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సదస్సులో పాల్గొనడానికి ఆసక్తి గల వారు www.sumshodini.kitsw లేదా kitsw.ac.in ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యార్థి సాంకేతిక పరిశోధనల పత్రాలను www.sumshodini@kitsw.ac.in ఈ–మెయిల్ ద్వారా జనవరి 20వ తేదీలోపు పంపించాలని తెలిపారు. ఈనెల 26వ తేదీలోపు పత్రాలు అంగీకరించినట్లు సమాచారం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రఘోత్తంరెడ్డి, కోకన్వీనర్ ప్రొఫెసర్ నరసింహారావు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాకరాచారి పాల్గొన్నారు.

ప్రాచీన సంస్కృతి, కళలను కాపాడుకోవాలి



వందన డిజీ హైస్కూల్‌లో..



బహుమతులు ప్రదానం చేస్తున్న కార్పొరేటర్ చందన

ఖిలా వరంగల్: పాశ్చాత్య సంస్కృతికి అలవాటుపడుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో తమ ప్రాచీన సంస్కృతి, కళలను ప్రతిఒక్కరూ కాపాడుకుంటూ భావితరాలకు అందించాలని వందన హైస్కూల్ ఆడెపు శ్యాంసుందర్ సూచించారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని వరంగల్ శివనగర్‌లోని డిజీ హైస్కూల్ ఆధ్వర్యంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు.

గణేష్‌నగర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో..

గణేష్‌నగర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు కార్పొరేటర్ గుండు చందన్ బహుమతులను ప్రదానం చేశారు. గణేష్‌నగర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు విజయ్, సారంగం, రాధాకిషన్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, కిరణ్, సోమయ్య, వీరయ్య, స్వామి, రాజు, రవిబాబు, శ్రీనివాస్, రవి, నాంపల్లి పాల్గొన్నారు.

భీమారంలో ముగ్గుల పోటీలు

హసన్‌పర్తి: భీమారంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో మహిళలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కాంగ్రెస్ భీమారం గ్రామశాఖ అధ్యక్షుడు మార్క రాజు, నాయకులు బూర సారంగపాణి, బూర శ్రీకాంత్, ఆకుల కుమార్, చిట్టి బాబు పాల్గొన్నారు.



హసన్‌పర్తి: ముగ్గులు వేస్తున్న మహిళలు



రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో బహుమతుల ప్రదానం

రక్తదానం

పరకాల: రక్తదానం చేస్తే మరొకరికి ప్రాణదానం చేసినట్లు అవుతుందని పరకాల సివిల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ గౌతమ్ చౌహాన్ అన్నారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని స్నేహయూత్ ఆధ్వర్యంలో పలువురు రక్తదానం చేశారు.